క్లుప్తంగా

'అరూరి' కోసం ప్రచారం



ఐనవోలు: మండలంలోని వనమాల కనపర్తి, ఉడుతగూడెం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమై కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల్లో తిరుగుతూ.. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. సమస్యలను వెంటనే ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, మిద్దెపాక రవీందర్, వడిచర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. ఎన్జీఓస్ కాలనీ, టీవీ టవర్, శ్యామల గార్డెన్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఉద్యమ ఆకాంక్షల సదస్సు

హన్మకొండ: ఉద్యమ ఆకాంక్షల సదస్సును ఈనెల 16న నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల వేదిక కోఆర్డినేటర్ సాయిని నరేందర్ తెలిపారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఉదయం 10గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడం లేదని తెలిపారు. ఉద్యమ ఆకాంక్షల అమలు కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు వివరించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పీఈటీ నారాయణ ఎంపిక

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ గోగు నారాయణ.. ఆల్ ఇండియా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 16నుంచి న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పీఈటీగా వ్యవహరించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టీఏ జంక్షన్‌లో తనిఖీలు

మామునూరు: నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు వద్ద అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నుంచి హనుమకొండ వైపు వస్తున్న బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ వాహనాన్ని అధికారులు నిలిపివేసి తనిఖీ చేశారు.

మతతత్వ పార్టీలను ఓడించాలి

హసన్‌పర్తి: దేశ ప్రగతికి అత్యంత ప్రమాదకరంగా మారిన మతతత్వ రాజకీయ పార్టీలను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం చింతగట్టు క్యాంప్ సమీపంలో పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో బీజేపీ పాలకులు దేశాన్ని తిరోగమనం వైపునకు తీసుకెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. మామిండ్ల రమేష్ (పాలకుర్తి), సుదర్శన్ (వరంగల్ పశ్చిమ), గోల్కొండ కుమార్ (వర్ధన్నపేట), మారపెల్లి మల్లేష్ (భూపాలపల్లి), నూనావత్ వీరు (వైరా) నుంచి పోటీ చేస్తారని వెల్లడించారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు

హన్మకొండ: సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో చిన్నారులకు చిత్రలేఖన పోటీలను ఆదివారం నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి – బతుకమ్మ విశిష్టత అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. ముఖ్య అతిథిగా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ చిన్నారుల్లో అంతర్లీనమైన కళలను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తుచేశారు. పోటీలను నిర్వహించిన అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజులను అభినందించారు. పోలీస్ అధికారులు విజయ్‌కుమార్, రామారావు, అకాడమీ బాధ్యులు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సతీష్, రవీందర్ పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సభకు తరలిన కార్యకర్తలు

కాజీపేట: హైదరాబాద్‌లోని బీసీ రాజ్యాధికార సభకు కార్యకర్తలు ఆదివారం తరలివెళ్లారు. ఈమేరకు కాజీపేట చౌరస్తాలో ర్యాలీని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్ జెండాను ఊపి ప్రారంభించారు. రాష్ట్ర కమిటీ బాధ్యులు మేకల కేదారి యాదవ్ ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు కార్యకర్తలు తరలి వెళ్లారు. జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ విజయవంతం కావాలని కార్యకర్తలు ఆకాంక్షించారు.

శాయంపేట: పూజలు చేస్తున్న భక్తులు



కమలాపూర్ : పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరు:శైలపుత్రి అవతారంలో అమ్మవారు



దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


శాయంపేట: మండల కేంద్రంలోని శివమార్కండేయ, వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాల్లో ఆదివారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి విగ్రహన్ని సీనియర్ న్యాయవాది, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లెక్కల జలెంధర్ రెడ్డి దంపతులు బహూకరించగా ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం దుర్గా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

కమలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను నిర్వాహకులు, భక్తులు ఆనందోత్సాహాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో ప్రతిష్ఠించారు. నవరాత్రులపాటు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులు పూజలు నిర్వహించనున్నారు. నవరాత్రుల అనంతరం విజయదశమి (దసరా) రోజున దుర్గామాత నిమజ్జనంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఆత్మకూరు: మండలకేంద్రంలోని పోచమ్మసెంటర్‌లో శ్రీవేణుగోపాలస్వామి భజనమండలి ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శైలపుత్ర అవతారంలో అమ్మవారిని అలంకరించారు.అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పూజలు చేశారు.భజనభక్తులు అమ్మవారి కీర్తనలు ఆలపించారు.

శైలపుత్రి అలంకరణలో..

ఐనవోలు: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శైలపుత్రి అలంకరణలో భ్రమరాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి వేకువ జామున సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, ఋత్విక్ వరుణ దీక్షాధారణ, అఖండ దీపారాధన, త్రిశూలపూజ, అంకురారోపణ, మంటపారాధన, ప్రధాన కలశస్థాపన, అమ్మవారి నవ కలశ స్నపన సుగంధ పరిమళ ద్రవ్యాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నిత్యాహ్నికం, మహా నైవేద్యం, నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణతో మొదటిరోజు కార్యక్రమాలు ముగిసినట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపారు. అత్యంత విశిష్టమైన అమ్మవారి నవదుర్గ అలంకరణలను 9రోజులు భక్తులు దర్శనం చేసుకోవాలని చెప్పారు. అద్దంకి కిరణ్, తాళ్లపెల్లి శ్రీకాంత్, శంఖపెల్లి రాజు, రవితేజలు అమ్మవారి దీక్ష స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాతర్లపాటి రవీందర్, శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండిట్ గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, నరేష్, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.



ఐనవోలు: శైలపుత్రి అలంకరణలో అమ్మవారు

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం



నివాళులర్పిస్తున్న న్యూస్ పేపర్ ఏజెంట్లు

కాజీపేట అర్బన్: పేపర్ బాయ్ నుంచి దేశ రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని న్యూస్ పేపర్ ఏజెంట్స్ పరపతి పరస్పర సహాయక సహకార సంఘం సభ్యులు తెలిపారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని, ఆల్ ఇండియా న్యూస్ పేపర్స్ వెండర్స్ డేలో భాగంగా హనుమకొండలో కలాం చిత్రపటానికి సంఘం సభ్యులు పూలమాలలు వేసి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వుప్పు రాజేందర్, ఉపాధ్యక్షులు గూడురు వేణుప్రసాద్, బోడ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కుడికాల ప్రసాద్, కోశాధికారి యాపశెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కలాం ఆశయాలను కొనసాగించాలి

హన్మకొండ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. హనుమకొండ హనుమాన్‌నగర్ –1లో అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి నాయకులు, కాలనీవాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొట్ల మనోహర్, కుమార్ రెడ్డి, సిరిమల్లె ప్రవీణ్, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, రవికిరణ్, సుమన్, వెంకటేష్, అరవింద్, సోమయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాలి

శాయంపేట : కళాకారులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని కోలాట కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలుసాని దేవేంద్రరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కోలాటా కళాకారుల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులు సమిష్టిగా ఉద్యమించి కేసుల పాలైనా.. ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కళాకారులకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, హెల్త్ కార్డులు, రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమంలో కళాకారులను ప్రభుత్వం వినియోగించుకోవాలని కోరారు. కళాకారులకు తగిన గుర్తింపు ఇవ్వకుంటే రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుమల కుమార్, మండల అధ్యక్షుడు చంద్రయ్య, కళాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేంద్రరావు

నిరుపేద రెడ్ల సంక్షేమానికి కృషి చేయాలి



గజ్వేల్‌కు తరలిన నాయకులు

దామెర: రాష్ట్రంలోని నిరుపేద రెడ్డి కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రెడ్డి సంఘం సమావేశానికి మండలం నుంచి పెద్ద ఎత్తున రెడ్డి సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం రూ.5వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో భారీ బహిరంగ సభను రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి వెళ్లినవారిలో నాయకులు మన్నెం ఇంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండి మాధవరెడ్డి, కూనాటి సునీల్ రెడ్డి, కేతిపెల్లి రాజిరెడ్డి, గొంది సందీప్ రెడ్డి, ఆత్మకూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు రేవూరి సంపత్ రెడ్డి, కాంతాల రవీందర్ రెడ్డి, కీసర రాజిరెడ్డి ఉన్నారు.

గండ్ర సత్యనారాయణ రావు ఎంపికతో సంబురాలు



శాయంపేట: స్వీట్లు పంచుతున్న నాయకులు



వేలేరు: బాణసంచా కాలుస్తున్న నాయకులు

శాయంపేట: భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గండ్ర సత్యనారాయణ రావును ఎంపిక చేసినందుకు ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్ల పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గండ్ర సత్యనారాయణ రావును ఎంపిక చేసినందుకు ఏఐసీసీ, టీపీసీసీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో సత్యనారాయణ రావు గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు వలీ హైదర్, వైనాల కుమారస్వామి, మామిడిపల్లి సాంబయ్య, నిమ్మల రమేష్, కుక్కల భిక్షపతి, బాసాని మార్కండేయ, పత్తి శ్రీను, రఫీ, రాజేందర్, వీరన్న, కట్టయ్య, కుమారస్వామి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సింగపురం ఇందిర పేరును పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించడంతో ఆదివారం మండలంలోని సోడాషపల్లిలో ఆపార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇందిర గెలుపుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. ఇందిరకు టిక్కెట్ కేటాయించినందుకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల స్వామి, ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మ్యాక మహేష్, సంజీవరెడ్డి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఇతిహాసాలతోనే దేశ ఔన్నత్యం

వరంగల్: ఆధునిక ప్రపంచంలో భారతదేశం అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందడానికి సనాతన సంప్రదాయ ఆచరణతో పాటు మహర్షుల గ్రంథాలు, భగవద్గీత, పురాతన ఇతిహాసాలు ఎంతగానో దోహదపడుతాయని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. ఆరెపల్లి సమీపంలోని సప్త గురుధామంలో ఆదివారం భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతలు అందజేశారు. అనంతరం, ఆరెపల్లి నుంచి వచ్చిన సుమారు 40మంది నిరుపేదలకు బ్లాంకెట్లు, చీరలు అందజేశారు.

కేయూ జేఏసీ నాయకులపై దాడి హేయం



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి యాదవ్

కేయూ క్యాంపస్: ప్రవళిక అంతిమ యాత్రలో పాల్గొన్న కేయూ విద్యార్థి జేఏసీ నాయకులపై దాడి చేయటం హేయమైన చర్య అని కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ అన్నారు. కేయూలోని దూరవిద్య కేంద్రం ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ, గ్రూప్ –1 రద్దు, గ్రూప్ –2 పరీక్ష వాయిదా వలన నిరాశకులోనై ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థి ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కేయూ విద్యార్థి జేఏసీ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో కేయూ జేఏసీ నాయకులు డాక్టర్ వలీఉల్లాఖాద్రీ, మేడ రంజిత్, విజయ్‌కన్నా, మొగిలి వెంకటరెడ్డి, నాగరాజు, బొట్ల మనోహర్, బందిగ రాకేష్, జగన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

49ఏళ్ల తర్వాత కలుసుకున్నారు



ధర్మసాగర్: మాట్లాడుతున్న కృష్ణదేవరావు



కమలాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో..

ధర్మసాగర్: వారంతా 49ఏళ్ల క్రితం ఒకే బడిలో విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. పదో తరగతి తర్వాత వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. మళ్లీ ఆదివారం కలుసుకుని ఆనందంగా గడిపారు. వారే.. మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్ఎస్ 1974–75 పదో తరగతి పూర్వ విద్యార్థులు. తాము చదువుకున్న పాఠశాలలోనే ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి 40 మంది విద్యార్థులు ఒకచోటచేరి నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం నాటి చిలిపి పనులను గుర్తుకు చేసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటి హెచ్ఎం, ఉపాధ్యాయులు వరదారెడ్డి, రాధాకిషన్, శాస్త్రి, కుమారస్వామి, సింగారెడ్డి, నల్సార్ లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణదేవరావు, ప్రస్తుత హెచ్ఎం రాజేందర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

19 ఏళ్ల తర్వాత..

కమలాపూర్: కమలాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన నాటి విద్యార్థినులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 19 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయురాలు సుజాత, శశికళ, పీఈటీ రాజేందర్ తదితరులను పూర్వ విద్యార్థినులు సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. ఎంతో శ్రమకోర్చి తమనందరిని ఒక్కచోటకు చేర్చిన నిర్వాహకులకు పూర్వ విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు సుమలత, వసంత, సుజాత, శ్వేత, సుమలత తదితరులు పాల్గొన్నారు.


ఎంజీఎంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఎంజీఎం: దేశాయిపేటకు చెందిన సేవా వెల్ఫేర్ సొసైటీ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎంజీఎం ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 31మంది రక్తదానం చేశారు. అలాగే, కాలేయ వ్యాధితో బాధపడుతూ కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేసుకుంటున్న రామ్‌నాథ్‌పూర్‌కు చెందిన చిన్నారి నిహాల్‌కు సంస్థ నుంచి రూ.41 వేల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు జూపాక రత్నప్రణయ్ తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ ఆశాదేవి, సంస్థ సభ్యులు సుగుణాకర్, సురేందర్ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



మెట్టుగుట్టపై పూజలు చేస్తున్న నాయకులు

మడికొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోసం మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 64వ డివిజన్ అధ్యక్షుడు, దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, మెట్టుగుట్ట చైర్మన్ దువ్వ నవీన్ ఆధ్వర్యంలో అర్చకుడు అభిలాష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

పరకాలలో కాషాయజెండా ఎగరేద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాదరావు



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

● కాళీప్రసాదరావు

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో పరకాలలో కాషాయజెండా ఎగరడం ఖాయమని డాక్టర్ కాళీప్రసాదరావు అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుడారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరిపోయాయన్నారు. తెలంగాణ కేసీఆర్ చేతిలో బందీ అయిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడుతూ.. నిరుద్యోగి ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడితే ప్రభుత్వం నిందలు వేయడం తగదని అన్నారు. ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, నాయకులు శ్రావణ్‌కుమార్, పూజరి సత్యనారాయణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు పంచుతున్నారు

ఐనవోలు: బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే అరూరి రమేష్ ఫొటో ఉన్న బ్యాగ్, వాటర్ బాటిల్, టిఫిన్ బాక్స్‌ల్లో డబ్బులు పెట్టి పంచుతున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీ ఆగడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం మధ్యాహ్నం పున్నేలు క్రాస్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి అధికారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, రాష్ట్ర నాయకులు బన్న ప్రభాకర్, తిలక్, బొల్లపల్లి మహేష్, ప్రభాకర్, మహేందర్, శివ, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కమలాపూర్: తెలంగాణ పంచాయతీ రాజ్ 4వ తరగతి హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేష్‌కుమార్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నేరెళ్ల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చాగంటి రవి, కోశాధికారిగా మాడుగుల రాజమౌళి, అసోసియేట్ అధ్యక్షుడిగా ముషం రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా అంకుషావళి, సహాయ కార్యదర్శిగా మైదం కిరణ్, సభ్యులుగా నజీర్, సరిత ఎన్నికయ్యారని తెలిపారు. వీరి పదవీ కాలం మూడేళ్ల పాటు కొనసాగుతుందని సోమేష్‌కుమార్ పేర్కొన్నారు.



నూతన కార్యవర్గంతో ఉద్యోగులు

ప్రజాఆశీర్వాద సభకు తరలిన నాయకులు

ఎల్కతుర్తి: హుస్నాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ప్రజా ఆశీర్వాద సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వెళ్లారు. నాయకులు, కార్యకర్తలు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ప్రజానీకాన్ని సమీకరణ చేసి సభకు తరలించినట్లు మండలాల ఇన్‌చార్జ్‌లు తెలిపారు. వెళ్లినవారిలో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, గొడిశాల సమ్మయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, నాయకులు మహేందర్, తంగెడ మహేందర్ తదితరులు ఉన్నారు.



సభకు వెళ్తున్న నాయకులు